

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 07-09-2026 | సంపుటి: 3 | సంచిక: 215 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 07-09-2026 | VOLUME : 3 | ISSUE : 215 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


# రేవంత్ కేబినెట్‌లో భారీ మార్పులు

- విస్తరణకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్
- మూడు ఖాళీల భర్తీకి కసరత్తు
- బీసీ మహిళకు మంత్రి పదవి?
- పనితీరు ఆధారంగా శాఖల్లో మార్పులు
- నామినేటెడ్ పదవుల భర్తీపై సీఎం ఫోకస్

తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో మార్పుచేర్పులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న మూడు స్థానాలను భర్తీ చేయడంతో పాటు, కొంతమంది మంత్రుల శాఖలను మార్చడం, అవసరమైతే కొత్త ముఖాలకు అవకాశం కల్పించే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 6



**మూడు ఖాళీలు**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు బీసీ మహిళా ప్రాతినిధ్యం కూడా ఖాళీ అయింది. ప్రస్తుతం కేబినెట్‌లో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించడం కూడా విస్తరణలో కీలక అంశంగా మారింది.

**బీసీ మహిళకు అవకాశం**

కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత బీసీ మహిళా ప్రాతినిధ్యాన్ని భర్తీ చేయడంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గద్వాల విజయలక్ష్మికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, నేరెళ్ల శారదకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా, గుండు సుధారాణికి కూడా ఛైర్‌పర్సన్‌గా అవకాశాలు కల్పించారు. ఇదే సామాజిక సమీకరణాన్ని కొనసాగిస్తూ కేబినెట్‌లోనూ ఒక బీసీ మహిళకు చోటు కల్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మిగతా 2వ పేజీలో..




## కాంగ్రెస్ 1,000 రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్

- థర్డ్ క్లాస్ పరిపాలన సాగుతోంది
- త్వరలో ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్
- ప్రాజెక్టుల వైఫల్యాలపై కాంగ్రెస్‌ను ఎండగడతా
- లక్ష మందితో కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల సందర్శన
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ఎల్పీకి దిశానిర్దేశం

ఎర్రవల్లి, సెప్టెంబర్ 6:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో థర్డ్ క్లాస్ పరిపాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతానని పార్టీ నేతలకు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్ అసెంబ్లీ వ్యూహంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

మిగతా 2వ పేజీలో..


## అసెంబ్లీలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం

- నెల రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో డిమాండ్
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం కేసీఆర్‌కు అసెంబ్లీలో గౌరవం దక్కడం లేదు సాగునీటి ప్రాజెక్టులపై భారీ కార్యాచరణ సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాసం
- మాజీ మంత్రి హరీష్ రావు



2

## తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై ప్రభుత్వం సీరియస్



2

- మెజిస్టీరియల్ విచారణకు ఆదేశాలు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కేసు విచారణ
- ఫోరెన్సిక్, టెక్నికల్ ఆధారాల సేకరణ వేగవంతం
- పకడ్బందీగా ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశం
- బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ప్రభుత్వం

## బాసరలో రూ.20 కోట్లతో ఘాట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

- గోదారమ్మకు జలహారతి ఇచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- భక్తుల సౌకర్యాల కోసం ఘాట్ల అభివృద్ధి



2

## ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం



2

- పెళ్లి పేరుతో మోసం చేశాడని ఈశ్వర్ సాయిపై ఆరోపణలు
- పోలీసులు న్యాయం చేయడం లేదంటూ ఆవేదన
- ఈశ్వర్ సాయి భార్యపై మరో ఫిర్యాదు
- ఏఐ వీడియోల వైరల్‌పై పోలీసులకు ఫిర్యాదు
- ట్రోలింగ్ చేస్తున్న యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

## బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి



2

- రూ.6.70 లక్షల కోట్ల అప్పులు చేశారన్న మహేష్ గౌడ్
- కాళేశ్వరం, మిషన్ భగీరథపై తీవ్ర విమర్శలు
- ఆరు గ్యారంటీలను వరుసగా అమలు చేస్తున్నాం

## కొండా సురేఖపై చర్యలు.. ఏఐసీసీ స్వతంత్ర నిర్ణయం

- సురేఖ కుమార్తె వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి
- క్రమశిక్షణ విషయంలో ఎలాంటి వివక్ష లేదు

2

## ఉద్యోగ సంఘాలతో భట్టి చర్చలు విఫలం



3

- ఆందోళనలు విరమించాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి
- స్పష్టమైన హామీ రాలేదన్న ఉద్యోగ సంఘాలు
- 10న 'చలో హైదరాబాద్' యథావిధిగా
- ఉద్యమ కార్యాచరణపై రేపు మరోసారి భేటీ
- తదుపరి పోరాటంపై ఉద్యోగ సంఘాల జేఏసీ నిర్ణయం
- మల్లు భట్టి విక్రమార్క

## మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలి

ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

3

## తెలంగాణను ఫోటోనిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

- అధునాతన సాంకేతికతల్లో రాష్ట్రాన్ని కీలక కేంద్రంగా అభివృద్ధి
- సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌కు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్
- సెమీకండక్టర్ మిషన్–2.0తో అనుసంధానంపై చర్చ
- పరిశోధన నుంచి వాణిజ్య తయారీ వరకు ఎకోసిస్టమ్
- క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంలో భాగస్వామ్యానికి ఆహ్వానం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



3

# బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి

- అప్పులు, ఆస్తులపై బహిరంగ చర్చకు సిద్ధం
- బీఆర్ఎస్ నేతలకు పీసీసీ అధ్యక్షుడి సవాల్
- మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 6:
తెలంగాణ ఆర్థిక పరిస్థితి, గత పదేళ్ల పాలనలో చేసిన అప్పులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదిరింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సృష్టించిన ఆస్తులు, చేసిన అప్పులపై చర్చించేందుకు సిద్ధమా అంటూ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.

**పదేళ్లలో రూ.6.70 లక్షల కోట్ల అప్పులు**

స్వతంత్ర భారతంలో తెలంగాణ ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 65 ఏళ్ల కాలంలో చేసిన మొత్తం అప్పు కేవలం రూ.68 వేల కోట్లు మాత్రమేనని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అయితే గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్ర అప్పులు ఏకంగా రూ.6.70 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆరోపించారు. కేవలం పదేళ్లలోనే భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని ఆయన విమర్శించారు.

**కాళేశ్వరం, మిషన్ భగీరథపై విమర్శలు**

లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుల పాలనకు నిదర్శనంగా నిలిచిందని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నాయని, ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాల పేరుతో వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు. ఆయా పథకాల్లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

**ఆరు గ్యారంటీల అమలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే పేదలకు అండగా నిలుస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మహేష్ గౌడ్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వరుసగా అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యా రంగంలో మార్పుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఆరోగ్య రంగాన్ని ఆధునీకరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన కళ్యాణ లక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కులను లబ్ధిదారులకు క్రమం తప్పకుండా అందిస్తున్నామని వివరించారు.

**బహిరంగ చర్చకు సిద్ధమా?**

గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటితో సృష్టించిన ఆస్తుల వివరాలపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలకు ధైర్యముంటే శ్వేతపత్రంతో సహా ప్రత్యక్ష చర్చకు రావాలని సవాల్ విసిరారు. అప్పులు, ఆస్తులపై ప్రజల ముందు వాస్తవాలను తేల్చుకుందామని అన్నారు.


# రేవంత్ కేబినెట్‌లో భారీ మార్పులు

**పనితీరే ప్రామాణికం**

కేబినెట్ విస్తరణలో రాజకీయ సమీకరణాలతో పాటు మంత్రుల పనితీరుకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేస్తున్న సీనియర్ ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం ఒత్తిడి తెస్తుండగా..
కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలకు అవకాశం కల్పించడంపైనా చర్చ జరుగుతోంది. రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి ప్రయోజనం చేకూర్చే చురుకైన నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని రేవంత్ నిర్ణయించినట్లు సమాచారం.

**శాఖల్లో మార్పులు**

ఐటీ, రెవెన్యూ, నీటిపారుదల వంటి కీలక శాఖలను మినహాయించి మిగిలిన శాఖల్లో పనితీరును సమీక్షించే అవకాశం ఉంది.



అవసరాన్ని బట్టి మంత్రుల శాఖలను మార్చడంతో పాటు సమర్థత ఆధారంగా పోర్ట్‌ఫోలియోల పునర్విభజన చేపట్టే అవకాశముంది. పనితీరు సరిగా లేని వారికి హెచ్చరికగా ఈ మార్పులు ఉండనున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఒకేసారి నామినేటెడ్ పదవులు**

కేబినెట్ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవులను కూడా ఒకేసారి భర్తీ చేసే దిశగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తికావడం కూడా పాలనలో మార్పులకు సంకేతంగా భావిస్తున్నారు. కేబినెట్ విస్తరణ, శాఖల మార్పులు, నామినేటెడ్ పదవుల భర్తీ ద్వారా ప్రభుత్వం, పార్టీపై తన పట్టును మరింత బలోపేతం చేసుకోవాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ 1,000 రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్

**ప్రజల అజెండానే పార్టీ అజెండా**

సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాన్ని కేసీఆర్ నేతలకు వివరించారు. ఉభయ సభల్లో జరిగే ప్రతి చర్చలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. ప్రజల సమస్యలనే పార్టీ అజెండాగా మార్చుకుని ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. స్పీకర్ పక్షపాత వైఖరి అవలంబిస్తే సభలోనే ఎండగట్టాలని, ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నల వర్షం కురిపించాలని దిశానిర్దేశం చేశారు.

**సంక్షేమంపై నిలదీయాలి**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేసీఆర్ పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అసెంబ్లీ వేదికగా బలంగా వినిపించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలు, రైతు భరోసా, రుణమాఫీ అమలులో జాప్యంతో పాటు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీ అమలుపైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విఫలమై ప్రతిపక్షాలపై నిందలు వేస్తున్నారని కేసీఆర్ మండిపడినట్లు సమాచారం.



**ప్రాజెక్టులపై క్షేత్రస్థాయిలో పోరు**

కేసీఆర్ త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో చేస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు పూర్తయిన అనంతరం లక్ష మందితో కలిసి కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల వద్దకు వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించినట్లు వెల్లడించారు.

**ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం**

తనను రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడం కాదని, తాను ప్రజాక్షేత్రంలోకి వచ్చిన తర్వాత వారు ఏం మాట్లాడతారో చూద్దామని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆ పార్టీ నేతలకే అర్థమైందని, అందుకే రాష్ట్రంలో దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించిన కేసీఆర్.. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు బయట ప్రజల మధ్యకు వెళ్లి పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది.

# అసెంబ్లీలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం

ఎర్రవల్లి, సెప్టెంబర్ 6:
ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ఎండగడతామని స్పష్టం చేశారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని ఆరోపించిన ఆయన.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

**నెల రోజుల పాటు సమావేశాలు**

అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజుల పాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో డిమాండ్ చేస్తామని హరీశ్‌రావు తెలిపారు. సభలో తమకు మాట్లాడేందుకు తగిన సమయం, అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరుతామని చెప్పారు. ప్రతిపక్షానికి సముచిత ప్రాధాన్యం ఇవ్వకుండా వ్యవహరిస్తే ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. 22ఏ అంశంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు అన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని వ్యాఖ్యానించారు.

**కేసీఆర్‌కు గౌరవం దక్కడం లేదు**

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు అసెంబ్లీలో తగిన గౌరవం ఇవ్వడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్న పరిస్థితుల్లో కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా అభిప్రాయపడ్డామని తెలిపారు. గతంలో జయలలిత, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు వంటి నేతలు కూడా గౌరవం లభించని సందర్భాల్లో అసెంబ్లీకి దూరంగా ఉన్న విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. ఇదే సమయంలో సీఎం కుటుంబ సభ్యులకు భద్రత కల్పించే విషయంలోనూ ప్రశ్నలు సంధించారు. వార్డు మెంబర్‌గా కూడా లేని వ్యక్తికి గన్‌మెన్లను ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. ఇందుకోసం ప్రభుత్వ నిధులను ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు.

**సాగునీటి ప్రాజెక్టులపై భారీ కార్యాచరణ**

సాగునీటి ప్రాజెక్టుల అంశంలో బీఆర్ఎస్ భారీ కార్యాచరణకు సిద్ధమవుతోందని హరీశ్‌రావు తెలిపారు. రాబోయే రోజుల్లో లక్షలాది మందితో కలిసి కాళేశ్వరం ఎత్తిపోతల, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాల విషయంలో కేసీఆర్ ప్రత్యక్ష కార్యాచరణకు దిగనున్నారని వెల్లడించారు.

**స్పీకర్‌పై అవిశ్వాసానికి వెనుకాడం**

సభలో తమకు తగిన సమయం ఇవ్వకపోతే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా వెనకాడబోమని హరీశ్‌రావు హెచ్చరించారు. దీంతో రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

# కొండా సురేఖపై చర్యలు.. ఏఐసీసీ స్వతంత్ర నిర్ణయం

- పార్టీ లైన్ దాటితే ఎంతటి వారైనా చర్యలు
- వ్యక్తిగతంగా రాజీనామా కోరలేదు
- కాంగ్రెస్‌లోనే కొనసాగాలని కోరుకుంటున్నాం
- మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 6:
కొండా సురేఖ మంత్రివర్గ తొలగింపు వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఎన్టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్ట, క్రమశిక్షణకే కాంగ్రెస్ అధిష్ఠానం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే నిర్ణయం పూర్తిగా ఏఐసీసీ పరిధిలోనే జరిగిందని వెల్లడించారు.

**సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై అసంతృప్తి**

కొండా సురేఖ కుమార్తె చేసిన కొన్ని ఆరోపణలు, వ్యాఖ్యలు పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తీవ్ర ఇబ్బందికరంగా మారాయని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ వ్యవహారంపై వెంటనే స్పందించి సరైన వివరణ ఇవ్వాలని సురేఖను కోరినప్పటికీ.. ఆమె నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని చెప్పారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు పార్టీ అంతర్గత అంశాలు, విమర్శలను బహిరంగంగా ప్రస్తావించడం సరికాదని అభిప్రాయపడ్డారు.

**క్రమశిక్షణలో వివక్ష లేదు**

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ అమలులో కుల, మత, ప్రాంతీయ వివక్షకు తావులేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి నాయకులైనా చర్యలు ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పారు.
గతంలో జి. చిన్నారెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి వంటి పలువురు నేతలపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

**ఏఐసీసీ స్వతంత్ర నిర్ణయం**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించే నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ వివాదంపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదనే స్పష్టమైన సంకేతాన్ని ఈ చర్య ద్వారా ఏఐసీసీ ఇచ్చిందని పేర్కొన్నారు.

**వ్యక్తిగతంగా రాజీనామా కోరలేదు**

కొండా సురేఖను వ్యక్తిగతంగా ఎవరూ రాజీనామా చేయాలని కోరలేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలించి సమర్పించిన నివేదిక, సిఫార్సుల ఆధారంగానే ఏఐసీసీ చర్యలు తీసుకుందని తెలిపారు. కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఆమె వ్యవహరించే తీరును బట్టి తదుపరి నిర్ణయాలు ఉంటాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

మాదాపూర్, సెప్టెంబర్ 6:
తెలంగాణ జానపద నృత్య కళాకారుల వర్గంలో కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనకు న్యాయం జరగడం లేదనే మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి ప్రయత్నించగా.. కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించి గది తలుపులు పగలగొట్టి ఆమెను కాపాడినట్లు వెల్లడించారు.



**పెళ్లి పేరుతో మోసం చేశాడని ఆరోపణ**

జానపద పాటల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈశ్వర్ సాయి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని మాధురి గతంలో ఆరోపించారు. వీరిద్దరూ ఒకే గదిలో ఉన్న సమయంలో ఈశ్వర్ సాయి భార్య వారిని పట్టుకున్న ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. ఈ ఘటనపై ఈశ్వర్ సాయి తనపై వచ్చిన ఆరోపణలను ఖండించగా.. మాధురి మాత్రం తనకు జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించారు.

**పోలీసుల తీరుపై అసంతృప్తి**

తనకు న్యాయం చేయాలని, ఈశ్వర్ సాయిపై చర్యలు తీసుకోవాలని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు సరిగా స్పందించలేదని మాధురి ఆరోపిస్తున్నారు. ఈశ్వర్ సాయికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతున్నప్పటికీ ఫలితం లేకపోవడం, కేసు విచారణలో జాప్యం జరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మాధురి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**ఏఐ వీడియోలపై మరో ఫిర్యాదు**

ఇదిలా ఉండగా.. సామాజిక మాధ్యమాల్లో తనపై ఏఐ ద్వారా రూపొందించిన వీడియోలను వైరల్ చేస్తున్నారంటూ మాధురి రాథోడ్ నార్సింగి పోలీసులకు మరో ఫిర్యాదు చేశారు. తన మొబైల్‌ను దొంగిలించిన ఈశ్వర్ సాయి భార్య తనకు సంబంధించిన పోస్టులు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. వీడియోలను తనకు ట్యాగ్ చేస్తూ పరువుకు భంగం కలిగిస్తున్నారని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ట్రోలింగ్ చేస్తున్న యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్**

మాధురి ఆత్మహత్యాయత్నానికి పోలీసుల నిర్లక్ష్య వైఖరే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పెళ్లి పేరుతో మోసం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈశ్వర్ సాయిపై చర్యలు తీసుకుని, మాధురికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు తాజా ఫిర్యాదులపై పోలీసులు ఎలా స్పందిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

# కేసీఆర్ పదవికి న్యాయం చేయాలి..

- లేదా రాజీనామా చేయాలి..!
- ఫామ్‌హౌస్‌కే పరిమితమైతే ప్రతిపక్ష నేత హోదా ఎందుకు?
- 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం
- రెండేళ్లలో రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు
- మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 6:
ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలని.. లేదంటే అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ఆయన ఆ పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ శ్రేణులు ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించాయి.

**అధికారం శాశ్వతం కాదు**

అధికారం అనేది ప్రజలు ఇచ్చే కానుక అని మహేష్ కుమార్ అన్నారు. పదవులు శాశ్వతం కావనే స్పృహతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగానే ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల పక్షాన పనిచేస్తున్నామని తెలిపారు. ఇల్లు లేని అర్హులందరికీ ఇళ్లు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

**ఉద్యోగాలు, పెట్టుబడులే లక్ష్యం**

గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసి ఆ తర్వాత మొహం చాటేశారని మహేష్ గౌడ్ విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మరో రెండున్నరేళ్లలో మరింత మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా రెండేళ్లలో రూ.1.78 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు సాధించామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామని వివరించారు.

**గద్దర్‌కు ప్రత్యేక గౌరవం**

గత ప్రభుత్వం ఉద్యమకారులు గద్దర్, అందెశ్రీలను పూర్తిగా విస్మరించిందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ పేరిట ప్రత్యేక అవార్డులు ఏర్పాటు చేసిందని తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి వారికి తగిన గౌరవం కల్పించామని గుర్తుచేశారు.

**కేసీఆర్, బీఆర్ఎస్ తీరుపై విమర్శలు**

బీఆర్ఎస్ హయాంలో వైద్య రంగం పూర్తిగా కార్పొరేట్ రంగం చేతికి చిక్కిందని మహేష్ గౌడ్ ఆరోపించారు. కేటీఆర్ చదువు గురించి మాట్లాడటం బాగానే ఉన్నా.. ప్రజాపాలన ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు ప్రతినెలా జీతం తీసుకుంటూ ప్రజా సమస్యలపై చర్చించే అసెంబ్లీకి రాకుండా మొహం చాటేయడం ప్రతిపక్ష నేత హోదాను అపహాస్యం చేయడమేనని దుయ్యబట్టారు. బీజేపీ నేతలు వ్యంగ్యంగా మాట్లాడటం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు.

**మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం**

ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే వాటిని సరిదిద్దుకుంటామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై ప్రభుత్వం సీరియస్

హైదరాబాద్, సెప్టెంబర్ 6:
నగర పరిధిలోని తుక్కుగూడలో సంచలనం సృష్టించిన నర్సు హత్యాచార ఘటనపై తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ కోసం మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**పకడ్బందీగా దర్యాప్తు**

కేసు దర్యాప్తును అత్యంత పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు, సాంకేతిక ఆధారాల సేకరణతో పాటు ఇతర దర్యాప్తు ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు.

**సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు**

కేసును పోలీసులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ పకడ్బందీగా సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని సూచించారు.

**బాధిత కుటుంబానికి అండగా**

ఈ దుర్ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా దర్యాప్తు, న్యాయ ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# కాంగ్రెస్‌లో మరో నలుగురికి షోకాజ్ నోటీసులు

- కంది శ్రీనివాస్‌కు క్రమశిక్షణ కమిటీ నోటీసులు
- ఆదిలాబాద్ నేతల మధ్య ఆధిపత్యపోరుపై ఆగ్రహం
- జూపల్లి, సచిన్ సావంత్ సమక్షంలో వాగ్వాదం
- గజ్వేల్ నేతలు నర్సారెడ్డి, మల్లారెడ్డికి నోటీసులు
- వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో నలుగురు నేతలకు పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్‌కు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలపై నోటీసులు ఇచ్చింది.

**ఆదిలాబాద్‌లో ఆధిపత్యపోరు**

ఆదిలాబాద్ కాంగ్రెస్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, కంది శ్రీనివాస్ మధ్య కొంతకాలంగా ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఇటీవల ఉట్నూరులో జరిగిన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఇద్దరు నేతల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశానికి ఆహ్వానం లేకపోయినా సంజీవరెడ్డి హాజరయ్యారంటూ కంది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలోనే ఇద్దరు నేతలు ఒకరి నొకరు దూషించుకున్నట్లు సమాచారం.

**ఇద్దరికీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు**

ఈ వ్యవహారంపై వివరణ కోరుతూ కంది శ్రీనివాస్, సంజీవరెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీకి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడంపై నేతల నుంచి వివరణ కోరింది.

**గజ్వేల్ నేతలకూ నోటీసులు**

మరోవైపు గజ్వేల్‌కు చెందిన నర్సారెడ్డి, జూపల్లి మల్లారెడ్డికి కూడా క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. నర్సారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మల్లారెడ్డి పీసీసీకి ఫిర్యాదు చేయడంతో ఇద్దరికీ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

**వారం రోజుల్లో సమాధానం**

నోటీసులు అందుకున్న నేతలు వారం రోజుల్లోగా తమ వివరణ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది. ఇప్పటికే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో తాజాగా మరికొందరు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ కావడం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ క్రమశిక్షణ విషయంలో అధిష్ఠానం కఠినంగా వ్యవహరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

# ఉద్యోగ సంఘాలతో భట్టి చర్చలు విఫలం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:

రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల డిమాండ్లు, ఆందోళనల నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో ఉద్యోగ సంఘాల నేతలు జరిపిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి.
ఉద్యోగుల సమస్యలు, వివిధ డిమాండ్లపై చర్చించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆందోళనలను విరమించాలని భట్టి విక్రమార్క
ఉద్యోగ సంఘాల ప్రతినిధులను కోరారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. దీంతో ఆందోళనలను విరమించేది లేదని స్పష్టం చేశారు.

**'చలో హైదరాబాద్' కొనసాగింపు**

నెల 10న తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని తెలిపారు.

**రేపు మరోసారి భేటీ**

భవిష్యత్తులో అనుసరించాల్సిన కార్యాచరణపై ఉద్యోగ సంఘాల జేఏసీ రేపు ఉదయం మరోసారి సమావేశం కానుంది. తదుపరి ఉద్యమ కార్యాచరణ, పోరాట పంథాపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు జేఏసీ వెల్లడించింది.

# నీళ్ల కోసం పాదయాత్ర చేస్తా..!

- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల వద్దకు కేసీఆర్
- లక్ష మందితో కలిసి ప్రాజెక్టుల సందర్శన
- సాగునీటి సంక్షోభంపై ప్రజల్లోకి బీఆర్ఎస్
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలని దిశానిర్దేశం
- ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని కేసీఆర్ పిలుపు



ఎర్రవల్లి, సెప్టెంబర్ 6:

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం కీలకంగా మారింది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లాలని కేసీఆర్ నిర్ణయించారు. త్వరలోనే కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను స్వయంగా సందర్శించనున్నట్లు ప్రకటించారు.

**లక్ష మందితో ప్రాజెక్టుల సందర్శన**

కేవలం పార్టీ నేతలతో కాకుండా ఏకంగా లక్ష మందితో కలిసి రెండు ప్రాజెక్టులను సందర్శిస్తానని కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టుల పరిస్థితిని ప్రజలకు వివరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

**నీళ్ల కోసం భారీ పాదయాత్ర**

రాష్ట్రంలో సాగునీటి సంక్షోభం, ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు త్వరలోనే భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. ''నీళ్ల కోసం పాదయాత్ర చేస్తా'' అని పేర్కొంటూ సాగునీటి సమస్యపై ప్రజా ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**అసెంబ్లీపై ప్రత్యేక దృష్టి**

రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యలను సభలో ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు.

**ప్రజాక్షేత్రంలో ఉద్యమ కార్యాచరణ**

అసెంబ్లీ సమావేశాలతో పాటు ప్రజాక్షేత్రంలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను తీవ్రతరం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ నేతలకు సూచించినట్లు సమాచారం.

# బాసరలో రూ.20 కోట్లతో ఘాట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



- విస్తృత స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

నిర్మల్, సెప్టెంబర్ 6, :

గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసరలో చేపట్టనున్న ఘాట్ల నిర్మాణ, పునరుద్ధరణ పనులకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు పుష్కరాల సమయంలో వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో చేపడుతున్నారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గోదారమ్మకు జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో భాగమయ్యారు. గోదావరి పుష్కరాలు తెలంగాణకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక వేడుకలలో ఒకటని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు బాసరకు వచ్చే అవకాశముండటంతో ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ఘాట్ల అభివృద్ధితో పాటు ఇతర మౌలిక సదుపాయాల విస్తరణ పనులు కూడా చేపడుతున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పాత ఘాట్ల పునరుద్ధరణతో పాటు కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు సులభంగా స్నానాలు ఆచరించేలా, రద్దీని సమర్థంగా నియంత్రించేలా ఆధునిక ప్రమాణాలతో ఘాట్లను అభివృద్ధి చేయనున్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రత్యేక ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రవాణా, వైద్య సేవలు, విశ్రాంతి కేంద్రాలు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. బాసరలో పుష్కర భక్తుల రద్దీకి అనుగుణంగా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల అనంతరం కూడా ఈ సదుపాయాలు యాత్రికులకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. బాసర క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైన అన్ని వసతులను కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల నాటికి అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. బాసరను పుష్కరాల సందర్భంగా దేశవ్యాప్తంగా ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.





# తెలంగాణను ఫోటోనిక్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:



అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కోప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి తదుపరి తరం సాంకేతికతల్లో తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆదివారం సచివాలయంలో నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే సారస్వత్‌తో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపొందించడంపై ప్రధానంగా చర్చించారు.

**సిలికాన్ ఫోటోనిక్స్‌పై దృష్టి**

ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణతో పాటు తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌ను ఇండియా సెమీకండక్టర్ మిషన్-2.0తో అనుసంధానించే అవకాశాలను సమీక్షించారు. రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

**డిజైన్ నుంచి తయారీ వరకు..**

డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, పరీక్షలు, సరఫరా వ్యవస్థలను పరస్పరం అనుసంధానించేలా కార్యాచరణ రూపొందించడంపై చర్చించారు. పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మార్చేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

**క్వాంటం కంప్యూటింగ్ కేంద్రానికి ఆహ్వానం**

నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలో ఏర్పాటు చేయనున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని డా. వీకే సారస్వత్‌ను ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై ఏర్పాటు చేయనున్న అడ్వైజరీ కౌన్సిల్‌కు నేతృత్వం వహించాలని కోరారు.

**సహకరిస్తానన్న సారస్వత్**

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని డా. వీకే సారస్వత్ తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో ఐటీఈ అండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సీఈవో ఏఎస్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో–ఆర్టీసీ ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలి

- ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ప్రజలకు సౌకర్యంగా నెలవారీ, రోజువారీ పాస్‌ల జారీకి ఆదేశాలు
- పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు వేగవంతం చేయాలని సూచన
- బేగంపేట్ మెట్రో భవన్‌లో సమన్వయ సమావేశం
- మెట్రోలో ప్రయాణించి సౌకర్యాల పరిశీలన




హైదరాబాద్, సెప్టెంబర్ 6,:

హైదరాబాద్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ సంయుక్త ప్రయాణ పాస్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ, విద్యుత్ శాఖ, మెట్రో వాటర్‌వర్క్స్ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. ప్రజలకు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నెలవారీ, రోజువారీ ఉమ్మడి పాస్‌లను అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ తదితరులు మెట్రో మొదటి, రెండో దశల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధాన కార్యదర్శికి వివరించారు. నగర రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను ఆయనకు వివరించారు. మెట్రో విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై జరుగుతున్న పనుల పురోగతిని కూడా వెల్లడించారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో కారిడార్ పనుల పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేకంగా ఆరా తీశారు. 7.5 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత పాతబస్తీ మెట్రో విస్తరణకు సంబంధించిన రోడ్ల విస్తరణ, టెండర్ ప్రక్రియ, జనరల్ కన్సల్టెంట్ నియామకంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ కీలక ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరగా నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించాలని ఆదేశించారు. మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ అమలుపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు తమ సాంకేతిక సన్నద్ధత గురించి వివరించారు. ఉమ్మడి పాస్ అమలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎప్పుడైనా అమలు చేయగలమని అధికారులు ప్రధాన కార్యదర్శికి తెలిపారు. దీనిపై స్పందించిన సంజయ్ జాజు, ఉమ్మడి చార్జీల విధానాన్ని త్వరగా ఖరారు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
సమావేశానికి హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ కె. అశోక్ రెడ్డి, మెట్రో రైల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, సీఎస్‌టీఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జీఎం (ఫైనాన్స్) సూర్యప్రకాశం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి శాఖల మధ్య సమన్వయం పెంచాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. సమావేశం అనంతరం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బేగంపేట్ నుంచి పారడైజ్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రో స్టేషన్లలోని వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ సదుపాయాలను పరిశీలించి మరింత అభివృద్ధి చేయాల్సిన అంశాలపై సూచనలు చేశారు. అలాగే ఎన్‌హెచ్ 44పై హెచ్‌ఎండీఏ నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులతో పురోగతిపై చర్చించారు. నగర రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు.





# ప్రియుడికి బైక్ కొనివ్వడానికి దొంగగా మారిన ప్రియురాలు


- స్నేహితురాలి ఇంట్లో తొమ్మిది సవర్ల బంగారు నగలు చోరీ..
- ప్రియుడికి రూ.2.50 లక్షల బైక్ బహుమతిగా ఇచ్చిన యువతి

**చెన్నై:** ప్రియుడికి బైక్ కొనివ్వాలనే ఉద్దేశంతో ఓ యువతి స్నేహితురాలి ఇంట్లో బంగారు నగలు చోరీ చేసిన ఘటన కోయంబత్తూర్ జిల్లా పొళ్లాచ్చిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొళ్లాచ్చికి చెందిన ఆర్. జాయ్ ప్రిన్సీ (19) స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతోంది. గత ఆగస్టు 16న జాయ్ ప్రిన్సీ తన స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లోని బీరువాలో ఉన్న తొమ్మిది సవర్ల బంగారు నగలను చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో తన ప్రియుడికి సుమారు రూ.2.50 లక్షల విలువైన బైక్‌ను కొనుగోలు చేసి బహుమతిగా ఇచ్చినట్లు వెల్లడైంది. స్నేహితురాలి తండ్రి తమిళ్ సెల్వన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొళ్లాచ్చి నార్త్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో చోరీకి సంబంధించిన అసలు విషయం వెలుగులోకి వచ్చింది. విచారణలో జాయ్ ప్రిన్సీ బంగారు నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో ప్రియుడికి బైక్ కొనుగోలు చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం జాయ్ ప్రిన్సీ పరారీలో ఉండగా, ఆమె ప్రియుడి కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ టార్గెట్!

- బాలిస్టిక్ క్షిపణులతో ప్రతీకార దాడి
- మా నౌకల కూల్చివేతకు ప్రతిస్పందన: ఇరాన్
- తప్పించుకున్నాం.. మా నౌకలు సురక్షితం
- ధ్రువీకరించిన అమెరికా మిలిటరీ వర్గాలు

**వాషింగ్టన్/టెహ్రాన్:** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. తమ చమురు నౌకలపై దాడికి ప్రతీకారంగా, అమెరికాకు చెందిన ఒక నౌకపై దాడి చేసినట్లు ఇరాన్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. తమ నౌకలపై దాడులకు నిరసనగా, సముద్ర మార్గంలో అమెరికా దిగ్బంధనాన్ని నిరసిస్తూ ఈ దాడి చేశామని ఐఆర్‌జీసీ ఎయిరోస్పేస్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఇరాన్ నౌకలను లక్ష్యం చేసుకొని ప్రాంతీయ జలాల్లో మోహరించిన అమెరికా నేవీకి చెందిన ఒక ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, గైడెడ్‌మిస్సైల్ డెస్ట్రాయర్లు టార్గెట్‌గా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ఐఆర్ఐబీ వెల్లడించింది. అయితే, ఇరాన్ క్షిపణి దాడుల నుంచి తమ యుద్ధనౌకలు సురక్షితంగా తప్పించుకున్నాయని, అమెరికా సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని యూఎస్ సైనిక అధికారులు ధృవీకరించారు.



**దాడి వీడియోలు షేర్ చేసిన ఇరాన్**

అమెరికా యుద్ధ నౌకల టారెట్‌గా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించడానికి ప్రతిస్పందనగా అమెరికా సైనిక దళాలు శనివారం విరుచుకుపడ్డాయి. ఇరాన్‌కు చెందిన మూడు క్రూడ్ ఆయిల్ నౌకలను సముద్రంలో ధ్వంసం చేశాయి. ఇందుకు సంబంధించిన వీడియోను యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంటో) తాజాగా ఆదివారం రిలీజ్ చేసింది. ఇరాన్‌కు చెందిన 'ఎం.టీ కైలో' అనే చమురు నౌక మంటల్లో చిక్కుకుని గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో కాలిపోయింది. "అమెరికా దళాల ఖచ్చితత్వం, నైపుణ్యం ఫలితంగా ఇరాన్ నౌక సముద్ర గర్భానికి చేరుకుంది" అని యుఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. సముద్ర జలాల్లో సైనిక మోహరింపులు, పరస్పర క్షిపణి దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింతగా అలుముకున్నాయి. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాలు సంయుక్తంగా ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై దాడులు చేయడంతో యుద్ధం మొదలైంది. ఆ తర్వాత జూన్‌లో ఇరుదేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. శాంతి చర్చలు పూర్తిగా విఫలం కావడంతో, పరస్పరం మిలిటరీ, ఆర్థిక వ్యవస్థలపై దెబ్బ కొట్టేందుకు అమెరికా, ఇరాన్ పరస్పరం తీవ్రస్థాయిలో యత్నిస్తున్నాయి.

# యుద్ధ విరమణ అంత ఈజీ కాదు!

- ఇరుదేశాలకూ భిన్న సైనిక లక్ష్యాలు
- కాబట్టి, ఒప్పందం కుదరడం తేలిక కాదు
- ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితి సులువైనదేమీ కాదు
- అమెరికా బృందంతో రష్యా అధ్యక్షుడు పుతిన్
- మాస్కో కొనసాగుతున్న చర్చలు

**మాస్కో:** ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంపిన రాయబారులతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శనివారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్లకు పైగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇరు పక్షాల వాదనలు, సైనిక లక్ష్యాలు భిన్నంగా ఉన్నాయని, కాబట్టి ఒప్పందానికి రావడం అంత సులభం కాదని ఆయన వ్యాఖ్యానించారు. చర్చలు క్లిష్టమైనవే అయినప్పటికీ, శాంతి ప్రయత్నాలు ప్రారంభించినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు చెబుతున్నానని రాయబారులతో పుతిన్ అన్నారు. తద్వారా, రష్యా తన సైనిక లక్ష్యాల నుంచి వెనక్కి తగ్గేది లేదని, ప్రయోజనకరమైన షరతులపైనే యుద్ధ విరమణకు మొగ్గుచూపనున్నట్టు రష్యా సంకేతాలు



ఇచ్చినట్టు అయ్యింది. కాగా, భేటీకి సంబంధించిన దృశ్యాలను రష్యా టీవీ ప్రసారం చేసింది. అమెరికా ప్రతినిధులకు పుతిన్ స్వాగతం పలకడం వీడియోల్లో కనిపించింది. కాగా, నాలుగేళ్లకు పైగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించేందుకు చర్చలు తిరిగి మొదలయ్యాయి. అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ పంపిన ప్రత్యేక రాయబారులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్‌లు శనివారం రష్యా రాజధాని మాస్కోలోని అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్యాలెస్‌లో అడుగుపెట్టారు. పుతిన్‌తో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా బృందం సరికొత్త శాంతి ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు అమెరికా ప్రకటించింది. కాగా, శాంతి చర్చలకు సానుకూల వాతావరణం కల్పించేందుకు వీలుగా, అమెరికా బృందం పర్యటన సందర్భంగా రష్యా, ఉక్రెయిన్ దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. మూడు రోజుల పాటు దాడులు చేసుకోకూడదని పరస్పరం అంగీకారానికి వచ్చాయి.

# ఇండోనేషియాలో అగ్నిపర్వతం బ్లాస్ట్

- 'మౌంట్ అనాక్ క్రాకటోవా' విస్ఫోటనం
- భారీ ఎత్తున ఎగసిపడిన బూడిద మేఘాలు
- జకార్తా సహా 6 ఎయిర్‌పోర్టులు మూసివేత
- 300లకు పైగా విమాన సర్వీసులు రద్దు

**జకార్తా:** ఇండోనేషియాలోని ప్రసిద్ధ 'మౌంట్ అనాక్ క్రాకటోవా' అగ్నిపర్వతం ఆదివారం ఒక్కసారిగా పేలిపోయింది. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న సుండా జలసంధి ప్రాంతంలో ఈ అగ్నిపర్వతం ఉంది. శుక్రవారం నుంచే లావా స్వల్పంగా ఎగసిపడింది. ఆదివారం తెల్లవారుజామున 3.53 గంటల సమయంలో 30 సెకన్ల పాటు అగ్నిపర్వతం తీవ్ర విస్ఫోటనం చెందింది. అగ్నిపర్వతం నుంచి లావా ఉప్పొంగడం సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యింది. అగ్నిపర్వతం నుంచి వాతావరణంలోకి పెద్ద మొత్తంలో బూడిద వ్యాప్తి చెందుతోంది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, నివాస ప్రాంతాలు అగ్నిపర్వతానికి 16 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉండటంతో జనాల్ని తక్షణమే ఖాళీ చేయించాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. అయితే, అగ్నిపర్వతానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉంటున్న స్థానికులు, టూరిస్టులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అగ్నిపర్వతానికి రెండు వైపులా భారీగా బూడిద మేఘాలు ఏర్పడ్డాయి. ఒక బూడిద మేఘం 20,000 అడుగుల (6,100 మీటర్లు) ఎత్తు వరకు ఎగసిపడి, ఈశాన్య దిశగా పయనిస్తూ జకార్తా, బంటెన్,



పశ్చిమ జావా ప్రాంతాలను కప్పేసింది. రెండవ మేఘం, ఏకంగా 50,000 అడుగుల (15,200 మీటర్లు) ఎత్తుకు లేచి, బంటెన్, లంపుంగ్, బెంగ్‌కులు ప్రావిన్సులు, హిందూ మహా సముద్ర ప్రాంతాలకు విస్తరించింది.

**విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం**

అగ్నిపర్వత విస్ఫోటనం కారణంగా ఇండోనేషియాలో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణంలో బూడిద భారీగా వ్యాపించడంతో రాజధాని జకార్తాతో సహా మొత్తం ఆరు ఎయిర్‌పోర్టుల్లో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. మొత్తం 301 విమాన సర్వీసులపై ప్రభావం పడింది. ఇందులో 58 ఇంటర్నేషనల్ సర్వీసులు ఉన్నాయి. సింగపూర్ ఎయిర్‌లైన్స్ ఆదివారం రోజంతా జకార్తాకు వెళ్లి వచ్చే అన్ని విమానాలను రద్దు చేసింది. ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా నిలిపివేయడంతో మొత్తం 22,800 మంది ప్యాసింజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా హాంగ్‌కాంగ్, సిడ్నీ, ఆమ్‌స్టర్‌డామ్, సీయోల్, దోహా, కౌలాలంపూర్ రూట్లలో విమానాలు రద్దవ్వడం లేదా ఆలస్యమయ్యాయి.

# ఇరాన్‌లో ఘోర ప్రమాదం..

- ఆయిల్ ట్యాంకర్ పేలుడు
- 11 మంది మృతి..
- ఏడుగురికి గాయాలు

**టెహ్రాన్:** పశ్చిమ ఇరాన్‌లో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సనందాజ్ సమీపంలోని హమేదాన్-సనందాజ్ అంతర్ నగర రహదారిపై ఇంధన ట్యాంకర్ అదుపుతప్పి ఇతర వాహనాలను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కనీసం 11 మంది మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు. స్థానిక అధికారులు, ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ట్యాంకర్ హమేదాన్ నుంచి మారివాన్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సనందాజ్ సమీపంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ట్యాంకర్ ఇతర వాహనాలను ఢీకొన్న అనంతరం ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. ప్రమాదానికి



ట్యాంకర్ బ్రేక్ వ్యవస్థలో సాంకేతిక లోపం కారణమై ఉండొచ్చని సనందాజ్ గవర్నర్ తెలిపారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి కారణాలపై అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదం కారణంగా సమీపంలోని పలు వాహనాలకు కూడా మంటలు అంటుకున్నట్లు అత్యవసర వైద్య సేవల అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స కోసం సనందాజ్‌లోని ఆసుపత్రులకు తరలించారు. ఇరాన్‌లో రోడ్డు ప్రమాదాలు తరచూ ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా వాహనాల భద్రత, ట్రాఫిక్ నిబంధనల అమలు, అత్యవసర సేవల సామర్థ్యం వంటి అంశాలపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సనందాజ్ ప్రాంతంలో 2018లో ఇంధన ట్యాంకర్-ప్రయాణికుల బస్సు ఢీకొన్న ఘటనలో 15 మంది మరణించగా, మరో నలుగురు గాయపడ్డారు.

# అమెరికాకు ఇరాన్ హెచ్చరిక.. మరింత తీవ్రమైన ప్రతీకారం తప్పదు!

- పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ హెచ్చరిక

**టెహ్రాన్:** అమెరికాతో జరుగుతున్న ఘర్షణలో ఆట నియమాలు' పూర్తిగా మారిపోయాయని, ఇరాన్ ప్రయోజనాలపై దాడికి దిగితే గతాని కంటే అత్యంత బాధాకరమైన ప్రతీకారం ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. గల్ఫ్ జలాల్లో అమెరికా సైన్యం ఇరాన్ నూనె ట్యాంకర్లపై దాడులు చేసిన మరుసటి రోజే ఆయన ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత వారం నుంచి హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఇరు దేశాల మధ్య దాడులు మళ్లీ పునరుద్ధరించబడ్డాయి. అంతకుముందు దక్షిణ ఇరాన్‌పై అమెరికా జరిపిన బాంబు దాడిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అమెరికా విధిస్తున్న దిగ్బంధాన్ని సైతం లెక్కచేయకుండా 'షాడో ఫ్లీట్' ద్వారా ఇరాన్ తన చమురు ఎగుమతులను కొనసాగిస్తోంది. జూన్ మధ్యలో కుదిరిన అవగాహనా ఒప్పందం విఫలం కావడం, అణు కార్యక్రమంపై చర్చలు నిలిచిపోవడంతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు అలుముకున్నాయి.



# యాదాద్రిలో రుక్మిణి కళ్యాణ మహోత్సవం..

**యాదగిరి గుట్ట, సెప్టెంబర్ 6:** యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయ ముఖమండపంలో రుక్మిణి కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణ ఘట్టాలను భక్తిశ్రద్ధలతో వీక్షించి పునీతులయ్యారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు, అర్చక బృందం, ఆలయ ఈఓ భవాని శంకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# చెదిరిన ఆశయాలకు చికిత్స ఏది?

- విరిగిన విద్యార్థుల ఎముకలు అతికించగలరేమో
- వారి జీవిత ఆశయాలను ఏ హాస్పిటల్ బాగుచేస్తుంది?
- పిల్లలు కోరింది చదువు, ఉపాధి, జవాబుదారీతనం
- అక్రమాలపై గళం విప్పితే ఇంత దారుణంగా కొడతారా?
- ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శల దాడి
- శ్రీరామ్ కాలేజీలో మోదీ ప్రసంగంపై ఖర్గే విమర్శనాస్త్రాలు

**న్యూఢిల్లీ:** ఇటీవల బీహార్‌లో నిరుద్యోగ యువతపై పోలీసుల బలప్రయోగం వ్యవహారంలో ప్రధాని నరేంద్ర మోదీ టార్గెట్‌గా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం (సెప్టెంబర్ 6) ఎక్స్ వేదికగా స్పందిస్తూ, పోలీసుల అణచివేత చర్యల్లో విరిగిన విద్యార్థుల ఎముకలు అతికించగలరా? అని నిలదీశారు. ఒకవేళ విరిగిన ఎముకలను హాస్పిటల్‌లో అతికించవచ్చమో గానీ, ఆ విద్యార్థుల మనస్సుల్లో గూడుకట్టుకున్న అభద్రతాభావం, నాశనమైన వారి జీవిత ఆశయాలను ఏ హాస్పిటల్ బాగుచేస్తుందని ఆయన ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలపై గళమెత్తిన యువతపై పోలీసులు అత్యంత



భయంకరమైన రీతిలో దాడి చేశారంటూ కేంద్ర, బీహార్ ప్రభుత్వాలపై రాహుల్ గాంధీ మండిపడ్డారు. యువత చేసిన నేరమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. "ఆ పిల్లలు ప్రభుత్వాన్ని కోరింది మూడే మూడు విషయాలు.. చదువు, ఉపాధి, జవాబుదారీతనం" అని అన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడంతో పాటు పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఏకే47 తుపాకులు, పిస్టళ్లతో గురిపెట్టారని, ఇద్దరు విద్యార్థుల భుజాల్లోకి బుల్లెట్లు దూసుకెళ్లాయని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కింది స్థాయి అధికారులను బలిపశువులను చేసి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకోలేద హెచ్చరించారు. ఇటీవల బాధిత విద్యార్థులతో తాను జరిపిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ షేర్ చేశారు.

**కాలేజీలోనూ మోదీ రాజకీయ వ్యాఖ్యలు: ఖర్గే**

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం (సెప్టెంబర్ 5) ఢిల్లీలోని ప్రఖ్యాత శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) చేసిన ప్రసంగాన్ని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. విద్యార్థులు, యువతకు సంబంధించిన విద్యా సమస్యలపై మాట్లాడాల్సిన వేదికను మోదీ రాజకీయ ప్రచారానికి వాడుకున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే ప్రతిపక్షాలకు కొత్త విశేషణలు, కొత్త పదాలను ఆపాదించడం మోదీకి అలవాటుగా మారిందని విమర్శించారు. నారాజ్ ఫూఫా, దిమాగీ నక్సల్, అర్బన్ నక్సల్, ఖాన్ మార్కెట్ గ్యాంగ్, ఆందోళన్ జీవి, పరాన్నజీవి అంటూ పదాలను మార్చుతున్నారని, కానీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను మార్చడం లేదని ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రజలకు దూరమైనప్పుడే.. వారికి చేరువవ్వాల్సిన అవసరం ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. కాగా, ఎస్ఆర్‌సీసీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రతి పనిని వ్యతిరేకించే వారిని యాంగ్రీ అంకుల్స్, ఫూఫాలు (అసంతృప్తిగా ఉండే మేనమామలు) అని సంబోధించారు.

# దేశవ్యాప్తంగా 8 హైకోర్టులకు కొత్త సీజేలు

- కొలీజియం సిఫార్సుల మేరకు కేంద్రం నియామకం

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు దేశంలోని 8 రాష్ట్రాల హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం శనివారం పొద్దుపోయాక ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదించిన అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలకు ఆమోదం తెలిపారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రకటించారు. పాట్నా హైకోర్టు సీజేగా ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వల్లూరి కామేశ్వర్ రావు నియమితులయ్యారు. కలకత్తా హైకోర్టు సీజేగా బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ రవీంద్ర వి. ఘుగే, రాజస్థాన్ హైకోర్టు సీజేగా ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజయ్ కుమార్ అగర్వాల్, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠి, పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు సీజేగా పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు జడ్జి జస్టిస్ అశ్విని కుమార్ మిశ్రా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు సీజే ఒరిస్సా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ రామ్ మహాపాత్ర, మధ్యప్రదేశ్ హైకోర్టు హైకోర్టు జడ్జి జస్టిస్ పుష్పేంద్ర సింగ్ భాటీ నియమితులయ్యారు.

# ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగ సంఘాల ఆందోళన

- రాకెట్లు, శాటిలైట్ల తయారీ భవిష్యత్‌లో ప్రైవేట్ రంగానికి అప్పగిస్తారా?
- చైర్మన్ వీ. నారాయణన్‌కు 9 ఉద్యోగ సంఘాల లేఖ..
- టైమ్‌లైన్, ఉద్యోగ భద్రతపై ప్రశ్నలు

**నేషనల్ డెస్క్:** భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెరుగుతున్న నేపథ్యంలో.. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ( ఇస్రో ) లోని ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సంస్థ భవిష్యత్ పాత్ర ఏమిటి? ప్రస్తుతం ఇస్రో నిర్వహిస్తున్న రాకెట్లు, ఉపగ్రహాల తయారీ వంటి కార్యకలాపాలు పూర్తిగా లేదా క్రమంగా ప్రైవేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థలకు బదిలీ కానున్నాయా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఇస్రో చైర్మన్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ కార్యదర్శి వీ. నారాయణన్‌కు లేఖ రాశాయి. సెప్టెంబర్ 4న రాసిన ఐదు పేజీల లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. వేలాది మంది ఇస్రో ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సంఘాలు.. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని స్పష్టం చేశాయి. అయితే ఇస్రోలో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలు భవిష్యత్‌లో



ఏ మేరకు ప్రైవేట్ రంగానికి బదిలీ అవుతాయనే దానిపై స్పష్టమైన విధానం ఉండాలని కోరుతున్నాయి. ముఖ్యంగా ఇస్రో భవిష్యత్‌లో కేవలం పరిశోధన, అభివృద్ధి సంస్థగా మాత్రమే మిగిలిపోతుందా? లేక రాకెట్ల అభివృద్ధి, తయారీ, ప్రయోగాలు, ఉపగ్రహాల తయారీ వంటి కీలక బాధ్యతల్లోనూ కొనసాగుతుందా? అనే ప్రశ్నలను ఉద్యోగ సంఘాలు లేవనెత్తాయి. ఈ ఆందోళనలకు ప్రధాన కారణం ఇన్‌స్పేస్ చైర్మన్ పవన్ గోయెంకా చేసిన వ్యాఖ్యలు. భవిష్యత్‌లో ఇస్రో స్వయంగా లాంచ్ వెహికల్స్ తయారు చేయడం, రొటీన్ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాలను కొనసాగించకుండా.. ఈ బాధ్యతలను ప్రైవేట్ కంపెనీలు లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే దిశగా మార్పు ఉంటుందని ఆయన వ్యాఖ్యానించినట్లు ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఈ వ్యాఖ్యలు ప్రభుత్వం, స్పేస్ కమిషన్ లేదా డిపార్ట్మెంట్ ఆఫ్ స్పేస్ అధికారికంగా తీసుకున్న తుది నిర్ణయాన్ని ప్రతిబింబిస్తున్నాయా? అనే అంశంపై ఉద్యోగ సంఘాలు లిఖితపూర్వక వివరణ కోరుతున్నాయి.

# ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక



**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**

ఖమ్మం వైద్య విభాగం ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం ఈ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా ఉప్పు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మజీద్ మియా, ఉపాధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, కోశాధికారిగా రమాకుమారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆశీర్వాదం, పవిత్ర, శ్రీకాంత్, గౌరవ సలహాదారుగా ప్రవీణ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ పి.సతీష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పర్వతపు అభినందించారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



- డప్పు కొడుతూ సర్పంచ్ సైదిరెడ్డి వినూత్న నిరసన

**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**

నేలకొండపల్లి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి పిలుపు మేరకు నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం గ్రామంలో సర్పంచ్ కోటి సైదిరెడ్డి వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. గ్రామంలో డప్పు భుజాన వేసుకుని ఇంటింటికీ తిరుగుతూ "కాంగ్రెస్ ఇచ్చిన హామీలు మీకు అందాయా?" అని ప్రజలను ప్రశ్నించారు. వృద్ధులకు రూ.4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ.2500, రైతులకు ఆత్మీయ భరోసా కింద రూ.15 వేలు, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం వంటి కీలక హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆయన విమర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట, బొడ్రాయి సెంటర్లో డప్పు వాయిస్తూ నినాదాలు చేస్తూ ప్రచారం కొనసాగించారు.కాంగ్రెస్ మాట తప్పడం వల్ల గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సర్పంచ్ సైదిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన చేపట్టిన ఈ వినూత్న ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభిం చింది. ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడి ఆయన ప్రచారాన్ని ఆసక్తిగా తిలకించారు.

# అండర్–14, అండర్–17 కబడ్డీ క్రీడాకారుల ఎంపికకు పోటీలు

**ఘట్కేసర్, రాజముద్ర న్యూస్:**

ఎస్‌జీఎఫ్ ఘట్కేసర్ జోన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 బాలబాలికల కబడ్డీ పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8న ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని శాంతినికేతన్ హైస్కూల్ ప్రాంగణంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేడిపల్లి, ఘట్కేసర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న క్రీడాకారులు ఈ పోటీలు, ఎంపికల్లో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు నిర్ణీత తేదీన పాఠశాలల ద్వారా పోటీలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. మరిన్ని వివరాలకు శ్రీరాములు, శారీరక విద్యా ఉపాధ్యాయులు 9640501084, నూనె శివరాం, శారీరక విద్యా ఉపాధ్యాయులు 92913 03090, జోనల్ కార్యదర్శి ఏ.పీ.ఎం. విద్యాసాగర్ 9849240177ను సంప్రదించవచ్చు.

# అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు



- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం రోజు చేవెళ్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# గుజరాత్ లో తెలంగాణ మీడియా బృందం పర్యటన

- పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో వారం రోజుల పర్యటన

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:**

హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన 10 మంది పాత్రికేయుల బృందం గుజరాత్ రాష్ట్రంలో పర్యటిస్తోంది. సెప్టెంబర్ 6 నుంచి 12 వరకు వారం రోజులపాటు కొనసాగే ఈ పర్యటనకు మీడియా కమ్యూనికేషన్ అధికారి (ఎమ్ అండ్ సీవో) వర్గంటి గాయత్రి నేతృత్వం వహిస్తున్నారు. ఈ రోజు అహ్మదాబాద్ చేరుకున్న ఈ బృందానికి పీఐబీ అధికారులు స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని విలేకరుల ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడం, రాష్ట్రాల మధ్య అభివృద్ధి అనుభవాలను పరస్పరం పంచుకోవడమే ఈ పర్యటన ప్రధానోద్దేశం. గుజరాత్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,



ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు, వివిధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రత్యక్షంగా పరిశీలించే వీలును పాత్రికేయులకు అందించడం ఈ పర్యటన లక్ష్యంగా ఉంది. ఈ పర్యటనలో భాగంగా సబర్మతీ రివర్ ఫ్రంట్, ధోలేరా ప్రత్యేక పెట్టుబడుల ప్రాంతం (ధోలేరా ఎస్ఐఆర్), గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్–సిటీ (గిఫ్ట్ సిటీ), అమూల్ డెయిరీ, ఐక్యతా మూర్తి, సర్దార్ సరోవర్ ఆనకట్ట, తదితర ముఖ్యమైన ప్రాజెక్టులు, సంస్థలను విలేకరుల బృందం సందర్శిస్తుంది. సీఈపీటీ విశ్వవిద్యాలయం, జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, సబర్మతీ మల్టీ మోడల్ హబ్‌లను కూడా వారు సందర్శిస్తారు. అధికారులు, ఇతర భాగస్వాములతో సమావేశమవుతారు.

# కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బి ఆర్ ఎస్ పార్టీ నేతలు మండిపడ్డారు. నేలకొండపల్లి టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇవ్వాల్సిన బాకీలను వివరిస్తూ రూపొందించిన బాకీ కార్డులను మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శీల వెంకటలక్ష్మి, టౌన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య, టౌన్ సెక్రెటరీ ఎం డి వాజిద్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం, కొండ కనక ప్రసాద్, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, ఖమ్మం కాంతారావు,



భాజ వెంకటేశ్వర్లు, వీరమల్ల కృష్ణ, దాసరి ఉదయ్, పగిడికత్తుల శ్రీకాంత్, ఎస్ కె, కాలీద్, శీలం శ్రీను, కూరపాటి అప్పారావు, చింతమల్ల వెంకటేష్, పగిడి కత్తుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోయాయని, ప్రజలకు న్యాయం జరిగే వరకు బిఆర్ ఎస్ తరపున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ నయవంచన పాలనలో ప్రజల ఇక్కట్లు

- దొంగ హామీలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ నాయకులు...
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి
- అమలు కానీ హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనపై శంకర్ పల్లి బిఆర్.ఎస్ పార్టీ శ్రేణుల ఆగ్రహం. రేవంత్ సర్కార్ ను గద్దె దించేదాకా నిరసనలను ఉధృతం చేస్తాం అని శంకర్ పల్లి బి ఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ పార్టీ విఫల పాలన సాగిస్తోందంటూ 5వ రోజు భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేపట్టింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ పిలుపు మేరకు శంకర్ పల్లి మండల కేంద్రంలోనీ మోకిల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందిన పల్లెలు, కాంగ్రెస్ పాలనలో నిధులు లేక, ప్రగతి కుంటుపడి పూర్తిగా విధ్వంసమయ్యాయని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ....పడకేసిన పారిశుధ్యం అనే అంశం మీద ఘాటు వ్యాఖ్యలు చేశారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా లోపించిందని, చెత్తాచెదారం పేరుకుపోయి అంటువ్యాధులు ప్రబలుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బిఆర్ఎస్ మాజీ ఎంపీపీ ధర్మాన గారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ....420 అబద్ధపు, అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్ నాయకులకు సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, ఈ వెయ్యి రోజుల పాలన కేవలం "వెయ్యి అబద్ధాల" పాలనగా సాగిందని విమర్శించారు. రైతు, సంక్షేమ పథకాలు నిలిపివేత, రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలకు ఆటంకాలు కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, నర్సింలు, బిఆర్ఎస్ సినియర్ నాయకులు వాసుదేవ్ కన్నా , మాజి మార్కెట్ కమిటి చేర్మేన్ మాణిక్ రేడ్డి, సర్పంచ్ లు రాఘవేందర్ రేడ్డి , ఇంద్రాసేనా రేడ్డి, ఎరుకల శేకర్, కౌన్సిలర్ లు ఉషా విజయ్ కుమార్, వసంత మహేందర్ రెడ్డి, ప్రశాంత్, మాజి కౌన్సిలర్ లు శ్రీనాథ్ , మాజి సర్పంచ్ లు శ్రీధర్ , నర్సింహ రెడ్డి, శ్రీనివాస్ రేడ్డి , బద్దం సురేందర్ రెడ్డి , అడ్వకేట్ ఉపేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టి సినియర్ నాయకులు, యుత్ నాయకులు, మైనారిటీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు

**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**

నేలకొండపల్లి: తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారో బి ఆర్ ఎస్ నాయకులు చెప్పాలని, రేషన్ కార్డులు, దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని నమ్మించి మోసం చేసిన మాట నిజం కాదా అని నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు ప్రశ్నించారు. పది సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉండి ప్రజలకు మంచి చేయని వాళ్ళు ఈనాడు బాకీ కార్డుల పేరుతో డ్రామాలాడటం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజల సొమ్ము లక్షల కోట్లు దోచుకున్న వారు ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బాకీ కార్డుల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం తాము అధికారంలోకి రావడానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు కాబట్టే ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని తెలిపారు. దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తామని నమ్మించి మోసం చేసినందుకే ప్రజలు ఓటుతో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు బుద్ధి చెప్పారని అన్నారు. దొంగే దొంగ అన్న చందంగా బి ఆర్ ఎస్ పార్టీ పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, మహిళలు,



నిరుద్యోగులు, పేద ప్రజలు అందరూ సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎవరెన్ని అబద్ధాలతో ప్రజల ముందుకు వచ్చినా నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కళ్ళు తెరిచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడాలని హితవు పలికారు.

# గణేశ్ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

గణేశ్ ఉత్సవాల గురించి అన్నారం గ్రామంలో సర్పంచ్ ఉప సర్పంచ్ , గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు అందరి సమక్షంలో మీటింగ్ ఏర్పాటు చేసి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ ఐ మురళి అన్నారు , అలాగే గ్రామంలో దొంగతనాలు జరుగుచున్నవని ప్రతి ఇండ్లలో తాళం వేసి వేరే గ్రామం కి వెళ్ళినప్పుడు ఇంటిలో



ఎలాంటి ఆభరణాలు గాని డబ్బులు గానీ బీరువాలో పెట్టి వెళ్ళకూడదని డబ్బు బంగారం లాకర్లో పెట్టుకొని వెళ్లాలని లేదా తాళం వేయకుండా ఇంటిలో ఒక వ్యక్తి నుంచి వెళ్లాలని లేదా తాళం వేసినా ఇండ్లు మాకు ముందుజాగ్రత్తగా చెప్పాలని కోరడమైనది తాళం వేసిన ఇండ్లలో చోరీ జరుగుతున్నది దాని గురించి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు పెట్టుకోవాలని ఎస్సై మురళి తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**

రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు ముగ్గు పోసి, కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుద్దాల లింగం, ఉప సర్పంచ్ అంజయ్య, మాజీ సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు, విడీసీ అధ్యక్షులు గంగారం, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ ముట్టడికి విద్యార్థి సంఘాలు సిద్ధం!

- ఫీజుల వసూళ్లపై వేధింపుల ఆరోపణలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు




**నస్రుల్లాబాద్, రాజముద్ర న్యూస్:**

పాఠశాలకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం వారి విద్యార్థుల చదువు విషయం వివరించడంతో పాటు ఆ విద్యార్థుల పై వారు చూపుతున్న శ్రద్ధను వారికి తెలియచేస్తూ.. తల్లిదండ్రులుగా విద్యార్థిపై వారు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరిస్తుంటారు ఆయ పాఠశాలలు. దీని వల్ల వారి వారి పాఠశాలలో ఎలాంటి క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామో తెలియచేస్తూ ఆచరణలో కొన్ని పాఠశాలలు చూపెడుతుంటాయి. ఇదిలా ఉండగా నస్రుల్లాబాద్ మండ లంలోని ఓ స్కూల్ యాజమాన్యం మాత్రం ఏ ఫేరెంట్స్కు సమాధానం ఇవ్వకుండా ఇష్టరీతిన వ్యవహరిస్తూ, ఫీజుల విషయంలో సైతం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు నిబంధలను విస్మరిస్తున్నట్లు ఆ స్కూల్ తీరుపై కొందరు విద్యార్థి సంఘాల నాయకులు అసహనంతో ముట్టడికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలో నాలుగు ప్రైవేట్ పాఠశాలలు ఉండగా ఇందులో కొన్ని రేకుల షెడ్లలో నిర్వహించడం విమర్శలు దారిస్తుంది. మరికొన్ని పాఠశాల లు ఫేరెంట్స్ ను సైతం గేటు బయటే నిల్చొబెడుతున్నట్లు తెలుస్తుంది. ఇదేమిటని ప్రశ్నిస్తే.. విద్యార్థుల భద్రత అంటున్నారని., కానీ ఇక్కడ ఫీజుల విషయంలో విద్యార్థు లను ఎండలో నిల్చొబెడుతూ ఇబ్బందులు పెడుతుండటం, ఇతర విషయాలు బయటకు తెలియనివ్వకుండా ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. నిబంధనలు విస్మరిస్తున్నా ఆ పాఠశాలపై ఇప్పటికే విద్యాశాఖ అధికారులు సైతం ఫిర్యాదు సైతం వెళ్లినా పట్టించుకోవడం లేదనే బహిరంగ విమర్శలు ఉన్నాయి. దీంతో విద్యార్థి సంఘాల నాయకులు ఆ పాఠశాలను ముట్టడించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ విషయమై ఉన్నత విద్యశాఖ అధికారులు పూర్తి విచారణ చేపట్టి నిబంధనలు పాటించని పాఠశాలలతో పాటు ఫీజుల విషయంలో విద్యార్థులను వేదిస్తున్న ఆ పాఠశాలపై చర్యలు తీసుకుంటారా..? లేదా అనేది వేచి చూడాల్సిందే.

# కౌన్సిలర్లు లేకుండానే కార్యక్రమ ప్రారంభోత్సవాలు





- మండిపడ్డ బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- కో-ఆప్షన్ సభ్యులతోనే కార్యక్రమాలు
- ఎమ్మెల్యే వైఖరిపై కౌన్సిలర్ల తీవ్ర అభ్యంతరం

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం విషయంలో ఎమ్మెల్యే వైఖరిపై పలువురు బిఆర్ఎస్ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య మున్సిపల్ చైర్పర్సన్, వైఖరిపై 1, 2 వార్డు బిఆరెస్ కౌన్సిలర్లు డప్పు సువర్ణ చందు, దూత మల్లేష్ లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు చాకలి నాగమణి రాంచంద్రయ్య ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే యాదయ్య మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కమిషనర్ యాదగిరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ వార్డు అభివృద్ధి కార్యక్రమాలలో తమకు సమాచారం లేకుండా కో – ఆప్షన్ సభ్యులతో కార్యక్రమాలు కొనసాగించడం ఏమిటని వారు ప్రశ్నించారు . మాకు సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే అవమానించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉనికిని చాటుకోవటానికి అధికారపార్టీ ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు ఈ విధంగా అవలంబిస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు .

**ఎమ్మెల్యే ప్రజాస్వామ్య పద్ధతుల్లో గౌరవం ఇవ్వాలి...**

ఎమ్మెల్యే ప్రజాస్వామ్య పద్ధతుల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా అందరిని గౌరవిస్తూ సమస్యలను పరిష్కరించాలే తప్ప ఇలాంటి వైఖరి ప్రదర్శించడం సరికాదని వారు హితవు పలికారు. మున్సిపల్ చైర్పర్సన్ ప్రజా ప్రతినిధిగా ఉండి కౌన్సిలర్లను అవమానించడం సరైనది కాదని హితవు పలికారు.

తమ వార్డులో కౌన్సిలర్లు చేపట్టిన అభివృద్ధి పనులకు కో –ఆప్షన్ సభ్యులు వారు చేసినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యల వల్ల వార్డు అభివృద్ధి కుంటుపడుతుందని కౌన్సిలర్ దూత మల్లేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధుల తీరు మారకుంటే ఆందోళనలు చేపడతామని తెలిపారు.

# బడిని కాపాడదాం.. గుడిని నిర్మిద్దాం

- ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విలువైన కాంక్రీట్ స్లాబ్ ఏర్పాటు
- పర్వతాపూర్‌లో భక్తిశ్రద్ధల మధ్య పర్వతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు





**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:**

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వైయస్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ పర్వతాపూర్ సాయి ఐశ్వర్య కాలనీలో నిర్మిస్తున్న పర్వతగిరి శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ నిర్మాణానికి ఆయన రూ.10 లక్షల విలువైన కాంక్రీట్ స్లాబ్‌ను ఏర్పాటు చేయించారు. ఆలయ నిర్మాణంలో భాగంగా కాంక్రీట్ స్లాబ్ పనులు చేపట్టిన సందర్భంగా కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న దాతలు, కమిటీ సభ్యులు, కాలనీవాసులను పలువురు అభినందించారు.

**ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం అదృష్టం**

ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ఆలయాలు ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను అందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పర్వతాపూర్ సాయి ఐశ్వర్య కాలనీలో భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా పర్వతగిరి శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణం జరుగుతుండటం సంతోషకరమైన విషయమన్నారు. ఇలాంటి పవిత్రమైన కార్యక్రమంలో తన వంతుగా సహకారం అందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. "బడిని కాపాడదాం.. గుడిని నిర్మిద్దాం" అనే సంకల్పంతో వైయస్ రెడ్డి ట్రస్ట్ ప్రజా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని ఆయన వెల్లడించారు. విద్యాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడమే ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు.

**పార్కు స్థలాన్ని కాపాడి ఆలయ నిర్మాణానికి కృషి**



పర్వతాపూర్ సాయి ఐశ్వర్య కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడేందుకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, ఆ స్థలంలో భవ్యమైన ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్న శ్రీ అభి ఆంజనేయ దేవాలయ కమిటీ సభ్యులను ఏనుగు సుదర్శన్ రెడ్డి అభినందించారు. కాలనీవాసుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్న కమిటీ సభ్యుల కృషి అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణం వెనుక ఉన్న భక్తుల సంకల్పం, కాలనీవాసుల ఐక్యత, కమిటీ సభ్యుల పట్టుదల ప్రశంసనీయమని పేర్కొన్నారు. పార్కు స్థలాన్ని పరిరక్షించి, దానిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఆలయం పూర్తయిన అనంతరం ఈ ప్రాంతం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుందని ఆకాంక్షించారు.

**ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి**

దేవాలయ నిర్మాణం ఒక్కరి బాధ్యత కాదని ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేరకు సహకారం అందించి ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణానికి ధన సహాయం మాత్రమే కాకుండా, శ్రమదానం, నిర్మాణ సామగ్రి అందించడం, ఇతర సేవా కార్యక్రమాల ద్వారా కూడా సహకరించవచ్చని తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కమిటీ పనిచేస్తోందని పేర్కొన్నారు.

**భవిష్యత్ తరాలకు సంస్కృతి, సంప్రదాయాల వారధిగా ఆలయాలు**

ఆధునిక జీవన విధానంలో యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందని ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా ప్రజలను ఏకం చేసే ఆధ్యాత్మిక, సామాజిక కేంద్రాలుగా నిలుస్తాయని తెలిపారు. పిల్లలు, యువతలో నైతిక విలువలు పెంపొందించడంలో, పెద్దలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చడంలో ఆధ్యాత్మిక కేంద్రాలు దోహదపడతాయని అన్నారు. అందువల్ల ప్రతి ప్రాంతంలో దేవాలయాలు, విద్యా సంస్థలు, సేవా కేంద్రాల అభివృద్ధికి ప్రజలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు**

ఆలయ నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళ్తున్న దేవాలయ చైర్మన్ దయాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కమిటీ సభ్యులను ఏనుగు సుదర్శన్ రెడ్డి అభినందించారు. కాలనీవాసుల సహకారంతో ఆలయ నిర్మాణం మరింత వేగంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్న ప్రతి ఒక్కరి సహకారం చిరస్మరణీయంగా నిలుస్తుందని అన్నారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.

**భారీగా పాల్గొన్న బీజేపీ నాయకులు, కాలనీవాసులు:**

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి మోహన్ రెడ్డి, భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర నాయకుడు పవన్ రెడ్డి, దేవాలయ్య చైర్మన్ దయాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, బీజేపీ నాయకులు రాము యాదవ్, గీతారామ్, బాల్ రెడ్డి, స్వప్న, సతీ గౌడ్, ఇంద్ర రెడ్డి, పద్మ రెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, సాయి ఐశ్వర్య కాలనీ వాసులు, పర్వతాపూర్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విలువైన కాంక్రీట్ స్లాబ్ ఏర్పాటు చేయించిన ఏనుగు సుదర్శన్ రెడ్డికి ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణం పూర్తయి భక్తులకు అందుబాటులోకి వచ్చే వరకు ప్రతి ఒక్కరూ తమ సహాయ సహకారాలు అందించాలని కమిటీ సభ్యులు కోరారు.

# ఇందిరాపార్క్ మహా ధర్నాలో శంకర్ పల్లి కాంగ్రెస్ నాయకులు

- బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి
- కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖర్ రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన భారీ మహా ధర్నాలో శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శంకర్ పల్లి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మహా ధర్నాకు హాజరై పార్టీ నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో కిక్కిరిసిన ఇందిరాపార్క్ పరిసరాలు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను నిర్వర్తించాల్సిన కెసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని విమర్శిం చారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడకుండా పదవిలో కొనసాగడం సరికాదని మండిపడ్డారు. కెసిఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



మహా ధర్నాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శంకర్ పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు. ఈ కార్యక్రమంలో సంకేపల్లి గోపాల్, డిసిసిగోపాల్ రెడ్డి, గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్, రావులపల్లి సర్పంచ్ కృష్ణ మూర్తి, ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, అలకంగూడ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, టంగుటూరు సర్పంచ్ కృష్ణారెడ్డి, టంగుటూరు ఉపసర్పంచ్, గోపులారం మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, టంగుటూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యకులు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, మోకిల విలేజ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంద్ర సత్యం తదితరులు పాల్గొనారు.



# వైభవ్ సూర్యవంశీ వీర బాదుడు..

- 57 ఏళ్ల రికార్డు బద్దలు

**స్పోర్ట్స్ డెస్క్:**

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాట్‌తో సంచలనం సృష్టించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే దులీప్ ట్రోఫీ చరిత్రలో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఘనతతో భారత క్రికెట్‌లో వైభవ్ పేరు మరోసారి మార్మోగుతోంది. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగిన వైభవ్.. కేవలం 42 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. ఇందులో 5 ఫోర్లు, 3 సిక్సర్లు ఉన్నాయి. మొత్తంగా అతడు 92 పరుగులు చేసి తన జట్టు స్కోరుకు కీలకంగా నిలిచాడు.

ఈ అర్ధశతకంతో వైభవ్ దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత పిన్న వయసులో హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 15 ఏళ్ల 157 రోజుల వయసులో ఈ ఘనత సాధించడం విశేషం. గత రికార్డు సుమారు 57 ఏళ్లుగా కొనసాగుతుండగా, దానిని వైభవ్ అధిగమించాడు.

**ఇప్పటికే ఎన్నో రికార్డులు**

వైభవ్‌కు ఇది తొలి సంచలనం కాదు. 202526 విజయ్ హజారే ట్రోఫీలో బీహార్ తరఫున ఆడుతూ కేవలం 84 బంతుల్లో 190 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌లో 150 పరుగులను కేవలం 59 బంతుల్లో పూర్తి చేసి, ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న పురుషుల లిస్ట్‌ఏ క్రికెట్‌లో వేగవంతమైన 150 పరుగుల రికార్డును బద్దలు కొట్టాడు. 2026 అండర్19 ప్రపంచకప్‌లోనూ వైభవ్ అదరగొట్టాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఫైనల్లో 80 బంతుల్లో 175 పరుగులు చేసి భారత్ భారీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2026లోనూ అతడి దూకుడు కొనసాగింది. రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు, 72 సిక్సర్లు సాధించి సీజన్‌లో సంచలనం సృష్టించాడు. 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ ఆరెంజ్ క్యాప్ గెలిచిన అత్యంత పిన్న వయస్కుడిగా కూడా నిలిచాడు.

**భవిష్యత్‌పై భారీ అంచనాలు**

చిన్న వయసులోనే వివిధ ఫార్మాట్లలో రికార్డులు బద్దలు కొడుతున్న వైభవ్ సూర్యవంశీపై క్రికెట్ అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే మాజీ క్రికెటర్లు అతడి ప్రతిభతో పాటు దీర్ఘకాలిక ఆటతీరు, అన్ని ఫార్మాట్లకు తగినట్లుగా ఆటను మెరుగుపరుచుకోవడం కూడా ముఖ్యమని సూచిస్తున్నారు. 15 ఏళ్ల వైభవ్ బ్యాట్ నుంచి వస్తున్న ఈ వరుస రికార్డులు భారత క్రికెట్‌కు మరో ప్రతిభావంతమైన తార ఎదుగుతున్న సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

# ఇషాన్ కిషన్ సెంచరీ..

- తొలి రోజే ఈస్ట్ జోన్ భారీ స్కోర్
- రాణించిన ఈస్ట్ జోన్ బ్యాటర్లు
- మహ్మద్ సిరాజ్ ఫ్లాప్ షో..



**స్పోర్ట్స్ డెస్క్ :**

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుతమైన సెంచరీతో అదరగొట్టాడు. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్) వేదికగా సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 79 ఓవర్లలో 385/4తో పటిష్ఠ స్థితిలో నిలిచింది.

**ఇషాన్ కిషన్ అజేయ శతకం**

కెప్టెన్ ఇషాన్ కిషన్ 135 బంతుల్లో 111 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతను 122 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. ఇది ఇషాన్ కిషన్ కెరీర్‌లో 10వ ఫస్ట్‌క్లాస్ సెంచరీ, దులీప్ ట్రోఫీలో రెండో శతకం. ఇషాన్ మొదట్లో కాస్త సంయమనంతో ఆడినా, సెంచరీ తర్వాత మరింత దూకుడుగా మారాడు. షార్ట్ బాల్స్‌ను పుల్, కట్ షాట్లతో బౌండరీలకు తరలించాడు. మరోవైపు కుమార్ కుశాగ్ర కూడా వేగంగా పరుగులు సాధించడంతో ఈస్ట్ జోన్ చివరి సెషన్‌లో పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది.

**ఈస్ట్ జోన్ బ్యాటర్ల దూకుడు**

తొలుత టాస్ గెలిచిన ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, అభిమన్యు ఈశ్వరన్ తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం అందించారు. అభిమన్యు ఈశ్వరన్ - 72, వైభవ్ సూర్యవంశీ -44, శిఖర్ మోహన్ - 85, ఇషాన్ కిషన్ - 111, కుమార్ కుశాగ్ర - 63 పరుగులతో రాణించారు. ఈ మ్యాచ్ లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 37 బంతుల్లో 44 పరుగులు చేసి దూకుడైన ఆరంభాన్ని అందించాడు. అతని ఇన్నింగ్స్‌లో ఒక సిక్స్, ఐదు ఫోర్లు ఉన్నాయి. బౌలర్ చమా మిలింద్ అతడిని ఔట్ చేశాడు. తర్వాత అభిమన్యు ఈశ్వరన్ 72 పరుగులు చేసి రనౌట్ కాగా, శిఖర్ మోహన్ 85 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మోహన్‌ను కూడా మిలింద్ బౌల్డ్ చేశాడు.

**కుశాగ్రతో కలిసి ఇషాన్ కీలక భాగస్వామ్యం**

నాలుగు వికెట్లు పడిన తర్వాత ఇషాన్ కిషన్, కుమార్ కుశాగ్ర కలిసి సౌత్ జోన్ బౌలర్లపై ఎదురుదాడి చేశారు. ఐదో వికెట్‌కు వీరిద్దరూ 127 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. కుశాగ్ర 75 బంతుల్లో 63 నాటౌట్‌గా ఉన్నాడు. అతని ఇన్నింగ్స్‌లో ఆరు సిక్సర్లు ఉన్నాయి. దీంతో చివరి సెషన్‌లో ఈస్ట్ జోన్ స్కోరు వేగంగా పెరిగింది.

**సౌత్ జోన్ బౌలింగ్ విఫలం**

ఈస్ట్ జోన్ బ్యాటర్లను కట్టడి చేయడంలో సౌత్ జోన్ బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ముఖ్యంగా భారత పేసర్ మహ్మద్ సిరాజ్ 14 ఓవర్లలో 96 పరుగులు ఇచ్చినా వికెట్ తీయలేకపోయాడు. చమా మిలింద్ రెండు వికెట్లు పడగొట్టగా, విజయ్ ఒక వికెట్ సాధించాడు. సౌత్ జోన్ ఓవర్ రేట్ కూడా సమస్యగా మారింది. అరగంట సమయం లభించినప్పటికీ ఆ జట్టు 79 ఓవర్లు మాత్రమే పూర్తి చేసింది. దీంతో 11 ఓవర్లు వేయాల్సి ఉండిపోయాయి.

**ఇషాన్‌కు టీమిండియా టెస్ట్ రీఎంట్రీపై ఆశలు**

ఈ సెంచరీ ఇషాన్ కిషన్‌కు వ్యక్తిగతంగా కూడా చాలా కీలకం. అతను చివరిసారిగా 2023లో భారత్ తరఫున టెస్టు మ్యాచ్ ఆడాడు. ఇప్పుడు దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో వరుసగా తన సామర్థ్యాన్ని చూపిస్తూ తిరిగి భారత టెస్ట్ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. దులీప్ ట్రోఫీలో ఇషాన్‌కు ఇది రెండో సెంచరీ. అంతకు ముందు 2024లో ఇండియా సీ తరఫున అనంతపురంలో 111 పరుగులు చేశాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతని అత్యధిక స్కోరు 273 పరుగులు, ఇది 2016 రంజీ ట్రోఫీలో ఢిల్లీపై జార్ఖండ్ తరఫున సాధించాడు. తొలి రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ స్పష్టంగా ఆధిపత్యంలో ఉంది. ఇషాన్ కిషన్, కుమార్ కుశాగ్ర క్రీజులో అజేయంగా ఉండటంతో రెండో రోజు ఈస్ట్ జోన్ మరింత భారీ స్కోరు సాధించే అవకాశం ఉంది. చెపాక్ పిచ్‌లో కొంత టర్న్, తక్కువ బౌన్స్ కనిపిస్తున్నందున మ్యాచ్ ముందుకు సాగేకొద్దీ స్పిన్నర్ల పాత్ర పెరగవచ్చు.

# డెడ్‌లిఫ్ట్‌లో సంచలనం

- 511 కేజీల బరువు ఎత్తి ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిన రౌల్ ఫ్లోర్స్
- హాఫ్థోర్ బ్జోర్న్‌సన్ రికార్డును చెరిపేసి.. కొత్త చరిత్ర సృష్టించిన మెక్సికన్ అథ్లెట్

**స్పోర్ట్స్ డెస్క్ :**

ప్రపంచ డెడ్‌లిఫ్ట్ గేమ్‌లో సరికొత్త రికార్డు నమోదు అయ్యింది. బర్మింగ్‌హామ్ యుటిలిటా అరీనా వేదికగా తాజాగా జరిగిన ప్రపంచ డెడ్‌లిఫ్ట్ ఛాంపియన్‌షిప్‌లో 26 ఏళ్ల రౌల్ ఫ్లోర్స్ చరిత్ర సృష్టించాడు. మెక్సికన్ స్ట్రాంగ్‌మ్యాన్ అయిన ఫ్లోర్స్ ఈ పోటీలో ఏకంగా 511 కేజీల బరువును ఔరా అనిపించాడు. దీంతో డెడ్‌లిఫ్ట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పిన అథ్లెట్‌గా రికార్డు సృష్టించాడు. దీంతో ఆడిటోరియం అంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

**బ్జోర్న్‌సన్ రికార్డ్ బ్రేక్!**

ఈ కాంపిటీషన్‌తో హాఫ్థోర్ బ్జోర్న్‌సన్ ప్రపంచ రికార్డును ఫ్లోర్స్ బద్దలు కొట్టాడు. బ్జోర్న్‌సన్ 2025 పోటీల్లో 510 కేజీల బరువును ఎత్తి రికార్డు సృష్టించాడు. దీంతో అప్పుడు అందరూ షాక్‌కు గురయ్యారు. ఇప్పట్లో ఈ రికార్డును ఎవరూ బ్రేక్ చేయలేరని అనుకున్నారు. కానీ, మరుసటి ఏడాదే ఫ్లోర్స్ ఆ రికార్డును బద్దలు కొట్టడం విశేషం. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




# డైమండ్ లీగ్ జావెలిన్‌లో శ్రీలంక చరిత్ర

- తొలిసారి టైటిల్ గెలిచి సంచలనం సృష్టించిన రుమేశ్
- 89.04 మీటర్ల బెస్ట్ త్రోతో అగ్రస్థానంలో నిలిచి, ప్రపంచ దిగ్గజాలకు షాకిచ్చిన అథ్లెట్

**స్పోర్ట్స్ డెస్క్ :**




డైమండ్ లీగ్ ఫైనల్ పురుషుల జావెలిన్‌లో శ్రీలంకకు చెందిన రుమేశ్ తరంగ పతిరాగే చరిత్ర సృష్టించాడు. 23 ఏళ్ల రుమేశ్ 89.04 మీటర్ల బెస్ట్ త్రోతో మొదటి స్థానంలో నిలిచి టైటిల్ గెలిచాడు. దీంతో డైమండ్ లీగ్‌లో విజేతగా నిలిచిన తొలి శ్రీలంక అథ్లెట్‌గా రికార్డు నమోదు చేశాడు. భారత స్టార్ నీరజ్ చోప్రా గాయం కారణంగా ఈ ఫైనల్‌లో పాల్గొనలేదు. పోలాండ్‌కు చెందిన డావిడ్ వెగ్నర్, ట్రినిడాడ్ అండ్ టొబాగో మాజీ ఒలింపిక్ ఛాంపియన్ కేశోర్న్ వాల్కాట్, గ్రెనడాకు చెందిన రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఆండర్సన్ పీటర్స్ లాంటి వాళ్లు బరిలో ఉన్నా చివరకు రుమేశ్‌దే పైచేయి. టైటిల్ గెలిచిన తర్వాత శ్రీలంకలాంటి చిన్న దేశం నుంచి వచ్చి ఇలాంటి పెద్ద పోటీ గెలవడం చాలా సంతోషంగా ఉందని రుమేశ్ చెప్పాడు.

**మూడో ప్రయత్నంలో 89.04 మీటర్లు..**

రుమేశ్ తన తొలి ప్రయత్నంలో 80.42 మీటర్లు విసిరాడు. రెండో ప్రయత్నంలో 79.73 మీటర్లకే పరిమితమయ్యాడు. ప్రారంభంలో వాల్కాట్ 83.99 మీటర్లతో ముందంజలోకి వెళ్లాడు. మూడో రౌండ్‌లో డావిడ్ వెగ్నర్ 87.47 మీటర్లు విసిరి తన వ్యక్తిగత బెస్ట్ నమోదు చేస్తూ లీడ్ తీసుకున్నాడు. అదే రౌండ్‌లో రుమేశ్ 89.04 మీటర్ల త్రోతో అందరినీ దాటేశాడు. ఆ తర్వాత నాలుగో ప్రయత్నంలో 85.96 మీటర్లు, ఐదో ప్రయత్నంలో 85.76 మీటర్లు నమోదు చేశాడు. చివరి ప్రయత్నం మాత్రం ఫౌల్ అయింది. మూడో ప్రయత్నంలో వచ్చిన 89.04 మీటర్లే అతనికి టైటిల్ అందించింది.

**రెండో స్థానంలో వెగ్నర్..**

డావిడ్ వెగ్నర్ 87.47 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. అది అతడి వ్యక్తిగత అత్యుత్తమ త్రో. కేశోర్న్ వాల్కాట్ 83.99 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఆండర్సన్ పీటర్స్ 83.70 మీటర్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. కెన్యాకు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ జూలియస్ యెగో 76.79 మీటర్లతో ఐదో స్థానానికి పరిమితమయ్యాడు. బెల్జియంకు చెందిన టిమోతి హెర్మన్ 71.79 మీటర్లు నమోదు చేయగా, అమెరికాకు చెందిన కర్టిస్ థాంప్సన్ 69.52 మీటర్లతో చివరి స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో మొత్తం ఏడుగురు జావెలిన్ త్రోయర్లు పోటీపడ్డారు.

**చలి వల్ల ఇంకా పెద్ద త్రో రాలేదన్న రుమేశ్**

89.04 మీటర్లతో టైటిల్ గెలిచినా తనకు ఇంకా పెద్ద త్రో చేయగల అవకాశం ఉందని రుమేశ్ చెప్పాడు. ఫైనల్ జరిగిన సమయంలో వాతావరణం చాలా చల్లగా ఉండటంతో తనకు అనుకున్న స్థాయిలో త్రో రాలేదని వివరించాడు. వాతావరణ పరిస్థితులు కష్టంగా ఉన్నాయని, అందుకే మరింత దూరం విసరలేకపోయానని మ్యాచ్ తర్వాత తెలిపాడు. అయినా మూడో ప్రయత్నంలో చేసిన త్రోనే చివరి వరకు ఎవ్వరూ దాటలేకపోయారు. ఈ విజయంతో అతను ఈ సీజన్‌ను మరో పెద్ద టైటిల్‌తో ముగించాడు.

**ఈ సీజన్‌లో 92.62 మీటర్ల రికార్డు**

రుమేశ్‌కు 2026 సీజన్ మొదటి నుంచి మంచి ఫలితాలే వచ్చాయి. జూన్‌లో జరిగిన రోమ్ డైమండ్ లీగ్‌లో 92.62 మీటర్లు విసిరి శ్రీలంక జాతీయ రికార్డును నెలకొల్పాడు. దోహాలో 88.68 మీటర్లు నమోదు చేశాడు. లాసానేలో 88.14 మీటర్లతో విజేతగా నిలిచాడు.



# తొలిసారి చైనా మాస్టర్స్ టైటిల్ గెలుచుకున్న సాత్విక్‌చిరాగ్

- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకుని హవా
- హోరాహోరీ పోరులో ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత స్టార్ డబుల్స్ జోడీ

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ, సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి తొలిసారిగా చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించారు. గత కొన్నేళ్లుగా ఎదురైన వైఫల్యాలను పక్కనపెట్టి ఈ భారత జోడీ ఫైనల్‌లో చైనా గడ్డపైనే ఆ క్రీడాకారులను ఓడించి ఘనవిజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో భారత జోడీకి శుభారంభం కాలేదు. సొంత ప్రేక్షకుల ముందు చైనాకు చెందిన హే జి టింగ్, రెన్ జియాంగ్ యు ద్వయం ఆరంభం నుంచే దూకుడుగా ఆడి తొలి గేమ్‌ను 2111 తేడాతో సునాయాసంగా గెలుచుకున్నారు. కానీ సాత్విక్, చిరాగ్ అనంతరం పుంజుకున్నారు. రెండో గేమ్‌లో చిరాగ్ నెట్ వద్ద దూకుడుగా ఆడి చైనా ఆటగాళ్లపై ఒత్తిడి పెంచడంతో, భారత్ ఆ గేమ్‌ను 2113 తేడాతో గెలిచి మ్యాచ్‌ను సమం చేసింది. మూడో, నిర్ణయాత్మక గేమ్ హోరాహోరీగా సాగింది. సాత్విక్ తన వ్యూహాలను మార్చుకుంటూ నిలకడగా కచ్చితమైన షాట్లు ఆడాడు. స్కోరు 18 17గా ఉన్నప్పుడు సాత్విక్ చేసిన ఓ తెలివైన సర్వ్ చైనా జోడీని పూర్తిగా దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత జోడీ తమ జోరును కొనసాగించి గంట 10 నిమిషాల్లో 1121, 2113, 2117 స్కోరుతో మ్యాచ్‌ను గెలుచుకుంది.

**చివరికి ఒక కల నిజమైంది**

సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్‌ను గెలుచుకోవడం ద్వారా ఎట్టకేలకు తమ చిరకాల కలను నెరవేర్చుకున్నారు. ఇదే టోర్నమెంట్‌లో ఈ భారత జోడీ 2023, 2025లో ఫైనల్‌కు చేరుకుని, రెండుసార్లు రన్నరప్‌గా నిలవాల్సి వచ్చింది. ఈసారి చైనా అభిమానుల సమక్షంలో ఆతిథ్య జట్టును ఓడించి, వారు తమ గత ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నారు.

# జింబాబ్వేను చిత్తు చేసిన సౌతాఫ్రికా..

- ట్రై సిరీస్‌ను కైవసం చేసుకున్న ప్రొటీస్ జట్టు
- హెర్మన్ మెరుపు అర్ధశతకం.. ఫైనల్లో జింబాబ్వేను ఉతికిపారేసిన ప్రొటీస్
- బౌలర్లు విజృంభించి, ప్రత్యర్థిని కట్టడి చేసిన తీరుతో అదరగొట్టిన సఫారీలు

**స్పోర్ట్స్ డెస్క్ :**

జింబాబ్వే, నమీబియాలతో జరిగిన ట్రై సిరీస్‌ను సౌతాఫ్రికా సొంతం చేసుకుంది. ఆదివారం విండ్‌హూక్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 48 పరుగుల తేడాతో జింబాబ్వేపై విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఓపెనర్ జోర్డాన్ హెర్మన్ (29 బంతుల్లో 53), డెవాల్డ్ బ్రెవిస్ (32), కన్నోర్ ఎస్టర్‌హుజెన్ (32) రాణించారు. జింబాబ్వే బౌలర్లలో న్యూమన్ నైమూరి, బ్రాడ్ ఎవన్స్ చెరో 2 వికెట్లు తీయగా, సికందర్ రజా ఒక వికెట్ తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 18 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. బ్రాడ్ ఎవన్స్ (31 బంతుల్లో 56 నాటౌట్) అజేయ అర్ధసెంచరీ సాధించినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలం కావడం జింబాబ్వే కొంపముంచింది.

## సాయి పల్లవి స్పెషల్ ప్రాజెక్ట్ టైటిల్ ఖరారు!

ప్రస్తుతం మన దక్షిణాది సినిమా నుంచి రాబోతున్న పలు ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ లలో లెజెండరీ దర్శకుడు మణిరత్నం అలాగే విలక్షణ నటుడు విజయ్ సేతుపతి అలానే టాలెంటెడ్ బ్యూటీ సాయి పల్లవి కాంబినేషన్లో చేస్తున్న లవ్ స్టోరీ కూడా ఒకటి. ఇటీవల వచ్చిన చిన్న పాటి ఆడియో గ్లింప్స్ తో ఫ్యాన్స్ లో మంచి ఉత్సుకత ఏర్పడింది. అయితే ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన టైటిల్ టీజర్ ని రేపు సెప్టెంబర్ 7న సాయంత్రం 5 గంటలకు విడుదల చేస్తున్నట్టు ఖరారు చేసారు. సో ఈ స్పెషల్ ప్రాజెక్ట్ పై మరింత క్లారిటీ రేపు వస్తుందని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి లెజెండరీ సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు అలాగే లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు. దాదాపు ఈ ఏడాదిలోనే ఈ సినిమా విడుదల కానుంది.



## వారణాసికి షాకింగ్ టార్గెట్!?

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా ప్రియాంక చోప్రా అలాగే పృథ్వీరాజ్ సుకుమారన్ ల కలయికలో గ్లోబల్ దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ సినిమా వారణాసి కోసం అందరికీ తెలిసిందే. ఇండియన్ సినిమా నుంచి మరో గేమ్ ఛేంజర్ లా నెక్స్ట్ లెవెల్ హైప్ తో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు అంతిమ దశకు చేరుకుంటుంది. అయితే ఈ సినిమాపై ఉన్న హైప్ తో బిజినెస్ లెక్కలు కూడా ఆకాశాన్ని అంటేలా కనిపిస్తున్నాయి. తాజా రూమర్స్ ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో వారణాసి భారీ బిజినెస్ పై కన్నేసినట్లు తెలుస్తోంది. ఏకంగా 320 కోట్లకి పైగా బిజినెస్ ఒక్క తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతున్నట్టు టాక్. ఇది మాత్రం సెన్సేషనల్ నెంబర్ అని చెప్పాలి. గతంలో RRR, పుష్ప 2 లాంటి సినిమాల రికార్డులు ఈ సినిమా బ్రేక్ చేస్తున్నట్టు తెలుస్తోంది. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## మహేష్ బాబుతో యంగ్ బ్యూటీ..!

సూపర్‌స్టార్ మహేష్ బాబు, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మరో సినిమా రాబోతోందంటూ జరుగుతున్న ప్రచారం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న పాన్-వరల్డ్ అడ్వెంచర్ ప్రాజెక్ట్ 'వారణాసి' పూర్తయిన తర్వాత మహేష్ ఈ చిత్రం చేయనున్నారని వార్తలు వచ్చాయి. రాజమౌళి సినిమా తర్వాత నటులకు ఎదురయ్యే సెంటిమెంట్‌ను ఎదుర్కోవడానికి అనిల్ మార్క్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ సరైన ఎంపిక అని ఫ్యాన్స్ భావించినప్పటికీ, ఈ వార్తలను అనిల్ రావిపూడి ఖండించారు. ఇవన్నీ కేవలం రూమర్లు మాత్రమేనని తేల్చిచెప్పారు. అయితే, అనిల్ ప్రస్తుతం వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో కలిసి సరికొత్త చిత్రంపై పనిచేస్తుండటంతో పాటు మరో కథను సిద్ధం చేస్తున్నారనే ప్రచారం ఈ రూమర్లకు మళ్లీ రెక్కలు తొడిగింది. అంతేగాక ఈ సినిమా కోసం మహేష్ బాబు సరసన మమిత బైజుని హీరోయిన్‌గా తీసుకోవాలని అనిల్ ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'వారణాసి' లాంటి భారీ సినిమా తర్వాత మహేష్ కూడా రీఫ్రెషింగ్ కమర్షియల్ మూవీ వైపు మొగ్గుచూపే అవకాశం లేకపోలేదని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతానికి ఈ కాంబినేషన్ కేవలం ప్రచారానికే పరిమితమైనప్పటికీ, భవిష్యత్తులో ఇది నిజ రూపం దాల్చుతుందో లేదో వేచి చూడాలి.







## కోలీవుడ్ ఎంట్రీకి సాలిడ్ సెటప్!

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లో నాచురల్ ఆక్టర్ సుహాస్ కూడా ఒకరు. అయితే సుహాస్ కోలీవుడ్ లో తన మొదటి సినిమాగా అది కూడ అక్కడ విలన్ గా చేస్తున్న సినిమానే 'మండాడి'. టాలెంటెడ్ నటుడు సూరి హీరోగా దర్శకుడు మతి మారన్ తెరకెక్కించిన ఈ సముద్రపు నేపథ్య సినిమా నుంచి మేకర్స్ తెలుగు ట్రైలర్ ని ఇప్పుడు విడుదల చేసారు. సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేసి సుహాస్ కి బెస్ట్ విషెస్ తెలిపాడు. ఇక ఈ ట్రైలర్ మంచి ఇంటెన్స్ గా కట్ చేసారని చెప్పొచ్చు. సముద్రపు పడవల పోటీ నేపథ్యంలో రెండు జట్లు లీడ్ చేసే నాయకులుగా సూరి, సుహాస్ లు తమదైన ఫామ్ లో కనిపిస్తున్నారు. తమిళ్ లో సుహాస్ డబ్బింగ్ చెప్పకోలేదు కానీ తెలుగులో చెప్పాడు. ఇక తనపై, సూరి పై మాస్ మూమెంట్స్ కూడా బాగున్నాయి. కానీ సూరికి తెలుగు డబ్బింగ్ బెటర్ గా చేయాల్సింది. ఇంకా విజువల్స్ కూడా మంచి గ్రిప్పింగ్ గా ఇందులో కనిపిస్తున్నాయి. సో మొత్తానికి చిత్ర యూనిట్ సాలిడ్ సెటప్ తో వస్తున్నారని చెప్పొచ్చు. ఇక ఈ సినిమా ఈ సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో గ్రాండ్ గా విడుదల కాబోతోంది.

## 'మహాకాళి' మేకర్స్ పక్కా ప్లానింగ్..!

'హనుమాన్' భారీ విజయం తర్వాత దర్శకుడు ప్రశాంత్ వర్మ నిర్మాణంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ విజువల్ ఫాంటసీ డ్రామా 'మహాకాళి'. పూజ కొల్లూరి దర్శకత్వంలో భూమి శెట్టి టైటిల్ రోల్‌లో, అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్య'గా, శ్రేయా రెడ్డి అమ్మవారి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 8న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా ప్రచారం కోసం మేకర్స్ ముందస్తు వ్యూహాన్ని పాటిస్తున్నారు. తాజాగా థియేటర్లలో ఉన్న 'మీర్జాపూర్' ప్రింట్లతో 'మహాకాళి' కొత్త టీజర్‌ను అటాచ్ చేయడం ద్వారా, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల ఆడియన్స్‌లో విశేష స్పందనను రాబడుతున్నారు. మరోవైపు ప్రశాంత్ వర్మ తన 'జై హనుమాన్' షూటింగ్‌లో బిజీగా ఉన్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సంక్రాంతి రేసులో వెంకటేష్ 'జనవరి 12 విడుదల', చిరంజీవి 'కాకా', శర్వానంద్ 'జార్జ్ క్రిష్', రజనీకాంత్ 'ధర్మన్'లతో పాటు మరికొన్ని చిత్రాలు పోటీలో ఉన్నప్పటికీ, అందరికంటే ముందే జనవరి 8న పక్కా ప్లానింగ్‌తో బరిలోకి దిగుతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com